



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 287 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 04-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## మేడారం జాతర విజయవంతం

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క



హైదరాబాద్, ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు.

-మిగతా 2 లో

## రాజ్యాంగాన్ని గౌరవించుకుంటే

# దేశం వీడండి

### వాట్సాప్ కు సుప్రీం కోర్టు వార్నింగ్

- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- ఒక్క అక్షరం కూడా షేర్ చేయొద్దు
- దేశ గోప్యతను అడ్డుకోలేరు
- ఇక్కడి చట్టాలను గౌరవించుకుంటే వెళ్లిపోండి
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు.

-మిగతా 2 లో




## భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

- చమురు దిగుమతులపై చర్చ జరగలేదు
- చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం వేళ రష్యా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ స్పందించింది. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పరోక్షంగా వెల్లడించారు. ఈ అంశంపై న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయని పెస్కోవ్

-మిగతా 2 లో



## తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

- 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానం
- దేశ వ్యాప్తంగా మొత్తం 1,075 మంది మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది.

-మిగతా 2 లో



## ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

- మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు
- ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది
- అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు.

-మిగతా 2 లో


## మన సహనమే విజయానికి బాట

### విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

- ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టాం
- అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ
- ఎన్‌డిఏ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు.

-మిగతా 2 లో





2 లో

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కెటిఆర్ విమర్శలు



2 లో

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

- ఉచితాలను ప్రకటించడానికి కాదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



## రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్): ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ,

-మిగతా 2 లో

## రాజ్యాంగాన్ని గౌరవించుకుంటే దేశం వీడండి

మొదటి తరువాయి

మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

మొదటి తరువాయి

మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీా శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

## రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

మొదటి తరువాయి

వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

- ఉచితాలను ప్రకటించడానికి కాదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,
ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# మేడారం జాతర విజయవంతం

మొదటి తరువాయి



ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

# భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

మొదటి తరువాయి

పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ తన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుందని రష్యా విశ్వాసం వ్యక్తం చేసింది.ఇటీవల మోదీతో జరిపిన ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేస్తామని మోదీ తనకు మాటిచ్చారని ట్రంప్ ప్రకటించారు. తాము జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఇది అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. అయితే ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే రష్యా నుంచి ఈ వివరణ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. భారత్ వంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోందని పెస్కోవ్ ఆరోపించారు. వాషింగ్టన్ నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నా న్యూఢిల్లీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఉంటాయని రష్యా బలంగా నమ్ముతోంది. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని, ఎలాంటి మార్పులు ఉంటే దౌత్య మార్గాల్లో సమాచారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, భారత్ తక్కువ ధరకు రష్యా ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యా నుంచే తీరుతున్నాయి. ఈ వాణిజ్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు, రష్యాకు కూడా ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో చమురు కొనుగోళ్లు ఆపేయడం అంత సులభం కాదని, ఇది కేవలం ట్రంప్ రాజకీయ విన్యాసాల్లో భాగం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

మొదటి తరువాయి

దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు. నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు.

## మన సహనమే విజయానికి బాట

మొదటి తరువాయి

ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు.

# వనపర్తి మున్సిపాలిటీలో కాంగ్రెస్ బిగ్ స్టెప్

**- 33 వార్డులకు అభ్యర్థుల ఖరారు**



**వనపర్తి టౌన్ ఫిబ్రవరి 03(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి మున్సిపాలిటీలో గల 33 వార్డులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను అధికారికంగా విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ, అన్ని వార్డుల్లో గెలుపే లక్ష్యంగా బలమైన, ప్రజల్లో గుర్తింపు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి బీ--ఫారంలు అందుకున్న అభ్యర్థుల జాబితా ప్రకారం 33 వార్డులకూ అభ్యర్థులను ఖరారు చేయడంతో ఎన్నికల పోరు మరింత వేడెక్కింది. మహిళలు, యువత, అనుభవజ్ఞులైన నాయకులకు సముచిత ప్రాధాన్యత ఇచ్చినట్లు జాబితా ద్వారా స్పష్టమవుతోంది. పార్టీ అధిష్టానం మార్గదర్శకత్వంలో స్థానిక నాయకత్వంతో సంప్రదింపులు జరిపి, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను నిర్ణయించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగుతున్నామని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని, వెంటనే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయని తెలిపారు. వనపర్తి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేస్తామని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

**విడుదలైన జాబితా ప్రకారం అభ్యర్థులు ఈ విధంగా ఉన్నారు**

1వ వార్డు చుక్క జయశ్రీ / చుక్క రాజు,
2వ వార్డు రమాదేవి / బి. కృష్ణ,
3వ వార్డు చీర్ల రజిని / చందర్,
4వ వార్డు గంధం శరవంద,
5వ వార్డు బాపనపల్లి వెంకటేష్,
6వ వార్డు పితాంబరం,
7వ వార్డు సుజాత / నక్క రాములు,
8వ వార్డు లక్ష్మీ / వెంకటేష్,
9వ వార్డు మహేశ్వరి (విభూది నారాయణ కుమార్తె),
10వ వార్డు మధుసూదన్ గౌడ్,
11వ వార్డు నందిపేట తులసి / తిరుపతయ్య,
12వ వార్డు నక్క రాణి / నక్క రాజు,
13వ వార్డు బొడ్డుపల్లి పరశురాం,
14వ వార్డు శారద / బ్రహ్మం చారి,
15వ వార్డు సౌమ్య / రఘు,
16వ వార్డు ఆవుల ప్రతిభ / జగదీష్,
17వ వార్డు షేక్ బషీర్,
18వ వార్డు జయానంద్,
19వ వార్డు కృష్ణ (ఎల్ ఐ సి),
20వ వార్డు పాకనాటి కృష్ణయ్య,
21వ వార్డు ధనలక్ష్మి,
22వ వార్డు చీర్ల కల్పన / సత్యం సాగర్,
23వ వార్డు జానంపేట నాగరాజు,
24వ వార్డు జయమ్మ / శ్రీనివాసులు,
25వ వార్డు కదిరే రాములు,
26వ వార్డు షేక్ షఫీ,
27వ వార్డు జంగిడి సరిత / రవికుమార్ (పాల రవి),
28వ వార్డు గడ్డం శిరీష / కోట్ల రవి,
29వ వార్డు జంగిడి నాగలక్ష్మి / జంగిడి రాజు,
30వ వార్డు రాచాల క్రాంతికుమార్ గౌడ్,
31వ వార్డు బండారు విజయలక్ష్మి,
32వ వార్డు అరుణ జ్యోతి / శ్రీనివాస్ గౌడ్,
33వ వార్డు మిడిదొడ్డి మాధవి / ఎస్.ఎల్.ఎన్ రమేష్.

# సీసీ రోడ్డు ప్రారంభించిన సర్పంచి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ లో నూతన సీసీ రోడ్డు పనులను సర్పంచి రాజేశ్వరి, ఉపసర్పంచి విజయ్ రాథోడ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి,గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గ్రామాలకు ఎంతగానో సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ అభిషేక్, ఇన్చార్జి ఎం.పీ.వో. లక్ష్మణ్, కార్యదర్శి జగన్ వార్డు సభ్యులు మల్లేష్,ప్రేమలత, జయందర్,సితి, కవిత మణిపాల్,సీతారాం,భారతి, మణిపాల్,దేవేందర్,తావుర్య, మాజీ సర్పంచి అంబర్ సింగ్, పరమేష్,విజయ్, భాస్కర్,హరిలాల్,పాండు,కుమార్,లాలు, భీమ, పంతు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి ఆశీర్వదించండి.. మున్సిపాలిటీను అభివృద్ధి చేసి చూపిస్తానని బిజెపి పార్టీ మూడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తల్లోజు గీత అన్నారు. నుచ్చుగుట్ట తండా, బర్రోని భావి తండా, ఎర్రబీక్య తండా మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో ఆమనగల్లు మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ అటవీ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



**అచ్చంపేట, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అటవీ శాఖ కార్యాలయంలో జూనియర్ అటవీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన డైరీని జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర ఐఎఫ్ఎస్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూనియర్ అటవీ అధికారుల సేవలు అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణలో కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని సూచించారు. సంఘం అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ, అధికారుల మధ్య సమన్వయం పెంపొందించేందుకు, విధి నిర్వహణలో ఉపయోగపడే సమాచారాన్ని అందించేందుకు ఈ డైరీ రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో రాంమోహన్ ఎఫ్డివో, అటవీ అధికారులు ఈశ్వర్, సుబ్బుర్, మాక్దుమ్, సంఘ సభ్యులు యండి ముజీబ్ ఘోరి, తేజశ్రీ, రాంబాబు, వల్య నాయక్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా అటవీ అధికారికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# తూప్రాన్‌లో ఎన్నికల పనుల పరిశీలన



**తూప్రాన్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మెంచు నగేష్ తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలెక్షన్ అథారిటీ, కమిషనర్ పి. గణేష్ రెడ్డికి తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్ర రెడ్డి, మండల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీ పై బిజెపి జెండా ఎగురవేస్తాం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీపై బిజెపి జెండా ఎగరవేస్తామని బిజెపి జాతీయ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి అన్నారు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ఆ దేశాల మేరకు ఆమనగల్లు బిజెపి పార్టీ కార్యాలయం నుంచి ఆమనగల్లు సీనియర్ నాయకులు తల్లోజు వెంకటయ్య, బిజెపి నాయకులు రాంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని మున్సిపాలిటీకి పోటీ చేస్తున్న బిజెపి పార్టీ అభ్యర్థులు 15 మంది కి బీ ఫామ్ లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కండె హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీని గెలిపించి పట్టణ ప్రజలు అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. 15 వార్డులలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయడం జరిగిందని, ప్రతి వార్డులో బిజెపి అభ్యర్థి కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆమనగల్ పట్టణ ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికలలో ఆమనగల్లు మున్సిపాలిటీ పై బిజెపి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల నాయకులు ,ప్రజలు కార్యకర్తలు, హాజరయ్యారు.

# ఏకలవ్య గురుకులలో గ్రూప్-I అధికారుల శిక్షణా శిబిరం విజయవంతం




**వెల్దండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో గ్రూప్--I అధికారుల శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. డా. ఎం.సి.ఆర్. హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మిళిత ఫౌండేషన్ కోర్స్‌లో భాగంగా అధికార శిక్షణార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుబంధంగా పంపబడ్డారు. ఫిబ్రవరి 2 నుండి 5 వరకు రెండు రోజుల పాటు కల్వకుర్తి గురుకుల పాఠశాలలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ మాట్లాడుతూ, డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు వంటి అధికారులు విద్యా వ్యవస్థ, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలు, పాలనా విధానాలపై ప్రత్యక్ష అవగాహన పొందారని తెలిపారు. ఈ శిబిరం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి అనుభవం లభించిందని పేర్కొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సత్కారం



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. కరీంనగర్‌లోని ఏసీఎల్‌బీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలస్, ఐఏఎస్ జారీ చేసిన ప్రశంసా పత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు. విద్యా ప్రమాణాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి, శాఖా కార్యక్రమాల విజయవంతమైన అమలులో ఉపాధ్యాయులు అందించిన సేవలను అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి డాక్టర్ శ్రీమతి అశ్వినీ తానాజీ వాక్కడే ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయుల అనుభవం, అంకితభావమే విద్యా వ్యవస్థకు పునాది అని, వారు నెలకొల్పిన విలువలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏ.డి. మాధవి, డీసీఈబీ కార్యదర్శి శ్రీ భగవంతయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీ మిలుకురి శ్రీనివాస్ తో పాటు పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. అధికారులు ఉపాధ్యాయులకు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని కోరుతూ కృతజ్ఞతలు తెలిపారు.

# మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలి

**-- జూలకంటి**



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం--టిఆర్ఎస్ మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, అందుకే టిఆర్ఎస్‌తో పొత్తు కుదుర్చుకున్నామని తెలిపారు. మిర్యాలగూడలో 6 వార్డులకు సిపిఎం అభ్యర్థులను నిర్ణయించగా, మిగిలిన 47 వార్డుల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మల్లేష్, వెంకటేశ్వర్లు, గౌతమ్ రెడ్డి, మంగారెడ్డి, పాండు, రవి నాయక్, పరశురాములు, జగదీష్ చంద్ర పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడలో బీజేపీ అభ్యర్థి చెవ్వా ప్రమోద్ కుమార్ ఎన్నికల ప్రచారం



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 8వ వార్డు బీజేపీ అభ్యర్థి చెవ్వా ప్రమోద్ కుమార్ ఉయ్యాలవాడలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని పలు కాలనీల్లో ఇంటింటా పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని, బీజేపీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ ప్రచారంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మలికేడి లక్ష్మణ్, జిల్లా కోశాధికారి రాజా రామేశ్వరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ నరేందర్ రెడ్డి, బలమల్లేష్ శ్రీకాంత్, శివ, శ్రీశైలం, శీను, మల్లారెడ్డి, రాజేష్, రవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు చేరువైన పాలన అందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చెవ్వా ప్రమోద్ కుమార్ కు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు.

# ఘనంగా శ్రీలక్ష్మి నంబులాద్రి స్వామి రథోత్సవం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో శ్రీలక్ష్మి నంబులాద్రి స్వామి రథోత్సవం, జాతర సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి కృపా కటాక్షాలతో పెద్దపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోందని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# తాటి ఈత కల్లులో ఆరోగ్య ప్రయోజనాలు


**- గౌడ ప్రభంజనం ట్రస్ట్**



**గంగాధర, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో తాటి ఈత చెట్లు పెంచి గీతకార్మికులను ఆదుకోవాలని గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్ అన్నారు.తాటి ఈత కల్లులో విటమిన్ బి, సి, పొటాషియం, ప్రొటీన్లు వంటి పోషకాలు ఉండి జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం, కిడ్నీ రాళ్లు కరుగుట, వ్యాధి నిరోధక శక్తి పెంపు వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు, శాస్త్రవేత్తలు నిర్ధారించారని ఆయన తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచి తాటి ఈత వనాలను విస్తరించాలని, ఆధునిక పద్ధతులతో చెట్లు ఎక్కి కల్లు తీయడానికి పరికరాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు.ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి తాటి ఈత చెట్లను ఉపాధి హామీ పథకంలో చేర్చాలని, ప్రజా ఆరోగ్యం కోసం గీత వృత్తి అంతరించిపోకుండా కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# బీఆర్ఎస్ తోనే మున్సిపాలిటీ అభివృద్ధి

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**





**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** బీఆర్ఎస్ తోనే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మంగళవారం కళ్యాణి గార్డెన్లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల బీఫామ్ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జి రజినీ సాయి చందు తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. మార్పు అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి మార్పు తీసుకురాలేదన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీ ఐదవ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రాముకు బీ ఫామ్ ను అందజేశారు. కార్యక్రమంలో పత్య నాయక్, నిర్మల, నిరంజన్ గౌడ్, ఖలీల్, కిషోర్, రమేష్, ఎంగలి రఘు, కాలే విక్రమ్, వస్పుల సాయిలు, యాదగిరి, జగదీష్, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు బీ--ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ మున్సిపాలిటీ 20 వార్డులకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతూ, వారికి బీ--ఫారాలను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు అభ్యర్థులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గడపగడపకు తీసుకెళ్లి, కాంగ్రెస్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు.దేవరకొండ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ గెలిచి, చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి హామీలను నెరవేర్చే బాధ్యత తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ 9వ వార్డులో బీజేపీ ప్రచారం



**షాద్‌నగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 9వ వార్డులో బీజేపీ అభ్యర్థి అశోక్ ప్యాట ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అభ్యర్థితో పాటు స్థానిక నాయకులు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, షాద్‌నగర్ అభివృద్ధికి కేంద్ర నిధులే కీలకమని, గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతి, కుటుంబ రాజకీయాలతో మున్సిపాలిటీని వెనక్కి నెట్టాయని విమర్శించారు. కమలం గుర్తుకు ఓటు వేసి అశోక్ ప్యాటను గెలిపించాలని ప్రజలను కోరారు.ప్రచారంలో కాలనీ వాసులు రవి, చందూ, మనోహర్, అంజీ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో బీ ఫామ్ లొల్లి





## ఆమనగల్లులో ఉద్రిక్త వాతావరణం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పురపాలిక ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీలో బీ ఫామ్ వివాదం తారస్థాయికి చేరింది. అభ్యర్థులకు పార్టీ బీ ఫామ్ అందజేయడానికి చివరి తేదీ కావడంతో పట్టణంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.మొత్తం 15 వార్డులకు అభ్యర్థులకు బీ ఫామ్‌లు అందజేయడానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లు కళ్యాణి గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ ఇన్‌చార్జి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ




వైస్ చైర్మన్ రజనీ సాయి చందు,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరయ్యారు.అయితే 14వ వార్డు నుంచి వస్పుల సాయిలు, వస్పుల సుగుణ ఇద్దరూ నామినేషన్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ పెద్దలు వస్పుల సాయిలుకు పార్టీ బీ ఫామ్ అందజేశారు. దీంతో వస్పుల సుగుణ మద్దతుదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పరస్పరం కుర్చీలు విసురుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పార్టీ అధిష్టానం నేతలు పరిస్థితిని చల్లార్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఆందోళనకారులు వినకపోవడంతో, చివరకు పార్టీ పెద్దలు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ పరిణామాల నేపథ్యంలో వస్పుల సుగుణ ఎటు వైపు అడుగులు వేస్తారనే అంశంపై 14వ వార్డు ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

## ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు వంటగ్యాస్ పంపిణీ




**మంచాల, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంచాల గ్రామానికి చెందిన అశ్వల మాధవి, నారెడ్డి జ్యోతి, చీర అశ్విని, మంత్రి ప్రశాంతిలకు మొదటి విడతలో వంటగ్యాస్ పొయ్యి అందజేశారు. అర్హులైన మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే వంటగ్యాస్ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగం గౌడ్, వార్డు సభ్యులు సాలయ్య, జంగయ్య, శ్రీశైలం, విద్యా కమిటీ సభ్యుడు బాలరాజు, గ్రామ సభ్యులు వినయ్, వెంకట్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, హరీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజ్ఞాపూర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజ్ఞా గార్డెన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుద్దెడకు చెందిన చిట్యాల నరసింహులు (45) మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని టిప్పర్ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

## ఇంటింటికి ఇంకుడుగుంత అవసరం



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామపంచాయతీలో వందరోజుల పనులలో భాగంగా గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు పర్యటించారు. పొలాలకు వెళ్లే రహదారి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను తీయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పునరుద్ధరణ పనులకు ఈస్టూమెంట్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, ఉపసర్పంచ్ రేనయ్య యాదవ్, ఈసీ కుర్మారెడ్డి, టీఏ రాజు, వార్డు సభ్యులు మంజుల రాఘవరెడ్డి, మాడుగుల చిట్టెమ్మ, సీనియర్ మేటు, గ్రామ యువకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**మానకొండూర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి గ్రామ శివారులోని బిక్కవాగు నుండి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా పోలీసులు పట్టివేశారు. ఎస్ఐ జి. సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను గన్నేరువరం గ్రామానికి తరలిస్తుండగా




ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ బత్తిని రమేష్ ( గన్నేరువరం), యజమాని బత్తిని చంద్రశేఖర్ ( గన్నేరువరం) పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

**అమ్రాబాద్, జనవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్, పదరా మండల కేంద్రాల్లో ప్రభుత్వ హై స్కూల్‌లలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని, ప్రభుత్వ విద్యను నిరుపేదలకు దూరం చేస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం కుట్రపూరితంగా అమలు అవుతోందని, విద్యారంగం రక్షణ కోసం ఉద్యమాలు అవసరమని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో నాణ్యమైన భోజనం



అందించకపోవడం, మారుమూల ప్రాంతాల్లో పాఠశాల భవనాలు నిర్మించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 7న అచ్చంపేటలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. పదరా మండల ఏఐఎస్ఎఫ్ కమిటీని ఏర్పాటు చేసి, ఇందు కార్యదర్శిగా, బాలాజీ అధ్యక్షుడిగా, రాధా సహాయ కార్యదర్శిగా, వినయ్ ఉపాధ్యక్షుడిగా, సరిత కోశాధికారిగా ఎంపికయ్యారు. అమ్రాబాద్ స్కూల్ యూనిటీ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మధు, జిల్లా నాయకులు నరేష్, శిల్ప, కల్పన, అఖిల, రవి, బి.నరేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి బాటలు వేస్తా



**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కాంగ్రెస్ తోనే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని 15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి రేవతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ప్రజలంతా గెలిపిస్తే ఆశించిన రీతిలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ప్రతిభా నగర్ కాలనీ ఉదయ్ నగర్ కాలనీ లో మంగళవారం వార్డు ఎన్నికల ఇన్చార్జి జక్కు అనంతరెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికార పార్టీ వారు కావడం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కౌన్సిలర్ గా గెలిపిస్తే నిధులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో శివలింగం, శేఖర్,సురేష్, గౌస్, ధోని, శివ,ఆకాష్, తిరుపతమ్మ, చంద్రకళ, సుగుణమ్మ, సులోచనమ్మ, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్లు, లైబ్రరీని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్లను, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం సహకారంతో ఏర్పాటు చేసిన లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు డైనింగ్ హాల్, తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందిస్తామని, చొప్పదండి నియోజకవర్గంలోని కొత్త పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, స్థానిక సర్పంచ్ దూలం కల్యాణ్, తాసిల్దార్ అంబటి రజిత, ఎండిఓ దామ్ రాము, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముద్దం నగేష్, ఉపసర్పంచ్ తిరుపతి, సాగి అజయ్ రావు, దూలం శ్రీనివాస్, దూలం అంజయ్య, బుర్గు గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## 23వ వార్డులో దూసుకుపోతున్న బీఆర్ఎస్





**ఇబ్రహింపట్నం, ఫిబ్రవరి 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇబ్రహింపట్నం మున్సిపల్ ఎ ఎన్నికలలో 23వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కన్సిలర్ అభ్యర్థి "నీలం శ్వేత బాలు" కారు దూసుకుపోతుంది . వార్డులో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ పార్టీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. నీలం శ్వేత బాలు మద్దతుగా రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొని, కాలనీల ప్రజలను కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నీలం శ్వేత బాలు మాట్లాడుతూ 23 వ వార్డులో అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ పార్టీ అన్నారు. ప్రజల మధ్యలో నుండి సేవలు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. వేరే పార్టీ నాయకుల మాటలకు మోసపోవద్దు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో రంగారెడ్డి జిల్లా పూర్వ గ్రధాలయాల చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, పార్టీ ఇంచార్జ్ అంబార్పేట మాజీ కార్పరేటర్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పద్మావతీ , యాచారం మండల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారంల అందజేత

**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు సంబంధించిన బీఫారంలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్తో పాటు మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు నారంభట్ల మహేందర్, వినీత్ రెడ్డి పాల్గొన్నారు. బీఫారంల సమర్పణతో నగరపాలక సంస్థ ఎన్నికల పోటీకి బీఆర్ఎస్ అభ్యర్థులు అధికారికంగా రంగంలోకి దిగారు.



# మేయర్ పీఠం లక్ష్యంగా బిఆర్ఎస్

**-ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే బిఆర్ఎస్ పార్టీ ఏకైక లక్ష్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని శ్వేత హోటల్‌లో 66 డివిజన్ల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఇతర నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గతంలో ఎలాంటి పొత్తులు లేకుండా టిఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠాన్ని గెలుచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో 90 శాతం రోడ్లు పూర్తి చేయడం, పలు ప్రాజెక్టులు తీసుకురావడం వంటి అభివృద్ధి పనులను ప్రజలు గుర్తించి బిఆర్ఎస్‌కు పట్టం కడతారని అన్నారు.కరీంనగర్ విజయంతో రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుందని, ప్రతి డివిజన్ ఇన్‌చార్జి కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇప్పటికే 60 మంది అభ్యర్థులకు బీఫామ్ ఇచ్చామని, ప్రతిపక్ష పార్టీల్లో మాత్రం అభ్యర్థుల ఎంపికపై అంతర్గత తగాదాలు కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు.నగర మేయర్ పీఠం బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్ ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలి




**హుస్నాబాద్, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గర్రెపల్లి జంక్షన్ వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్రెపల్లి నుంచి మెయిన్ రోడ్డుకు ఎక్కే సమయంలో కరీంనగర్--సైదాపూర్ రూట్‌లో వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదం జరగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు వెంటనే షోలర్ సిగ్నల్ లైట్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన దుర్శెట్టి అనూప్ కుమార్



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కరీంనగర్ బీజేపీ పార్టీకి భారీ షాక్ ఇచ్చేలా మాజీ కార్పొరేటర్ దుర్శెట్టి అనూప్ కుమార్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు.48వ డివిజన్, ప్రస్తుత 56వ డివిజన్‌కు చెందిన అనూప్ కుమార్, బీజేపీ పార్టీని వదిలి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా అనూప్ కుమార్ మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా బీజేపీకి సేవలందించానని, కార్పొరేటర్‌గా, సెంట్రల్ జోన్ అధ్యక్షునిగా పనిచేశానని తెలిపారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో సిట్టింగ్ అభ్యర్థి అయిన తనకు టికెట్ ఇవ్వకుండా వేరే వ్యక్తికి ఇవ్వడంతో మనస్తాపం చెంది పార్టీని వదిలినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో సంజయ్ గెలుపు కోసం కష్టపడ్డానని, కానీ ఇలా మోసం చేస్తారని ఊహించలేదన్నారు. బీజేపీ యువకులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలని సూచిస్తూ, కరీంనగర్ అభివృద్ధి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలోనే సాధ్యమని భావించి బిఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు, 56వ డివిజన్ బిఆర్ఎస్ అభ్యర్థి తాటిపెల్లి శ్రీవాణి-సుభాష్, నాయకులు చిట్టిమల్ల శ్రీనివాస్, గోలి రవి, ఇతర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరికలు



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో పలువురు నేతలు చేరారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ బీసీ సంఘాల నేత కేశి పెద్ది శ్రీధర్ రాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆధ్వర్యంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జోజి రెడ్డి మాట్లాడుతూ, శ్రీధర్ రాజు గత 36 సంవత్సరాలుగా బీసీ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాధించేందుకు ఆయన చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 63వ డివిజన్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా శ్రీధర్ రాజును ప్రకటించారు.అలాగే, మాజీ కార్పొరేటర్ పెంట స్వరూప సత్యం కూడా 13వ డివిజన్‌లో సింహం గుర్తుపై పోటీ చేయడానికి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆధ్వర్యంలో ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, చొప్పదండి నియోజకవర్గం అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నడి రోడ్డుపై బర్త్ డే పార్టీ హంగామా

**- 9 మంది అరెస్ట్**



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నడి రోడ్డుపై బర్త్ డే పార్టీ చేసుకుంటూ కారుపైకి ఎక్కి తల్వార్‌తో కేక్ కట్ చేసి హంగామా చేసిన యువకుల గ్యాంగ్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, తీగలగుట్టపల్లి హనుమాన్ వద్ద అర్ధరాత్రి జరిగిన ఈ పార్టీ సమయంలో స్థానికులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు, టెంట్ హౌజ్ వద్ద ఉన్న ఇద్దరు యువకులపై విచక్షణా రహితంగా దాడి చేసి డబ్బులు, మొబైల్ ఫోన్లు లాక్కున్నారని ఫిర్యాదు అందింది. బాధితులు చరణ్, యుగంధర్‌పై కర్రలు, బండలతో దాడి చేసి బెదిరింపులు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు మేజర్లు -- వాలకుంట్ల అజయ్, ముక్కెర విఘ్నేష్, గుంజ రంజిత్ ఉన్నారని, మిగిలిన ఆరుగురు మైనర్లు అని సీఐ వివరించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హుస్నాబాద్ యాదవ్ సంఘంలో వివాదం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ యాదవ్ సంఘంలో సభ్యత్వం విషయంలో వివాదం చెలరేగింది. సంఘ కార్యదర్శి దొంతరబోయిన హరీష్ (ఆరెపల్లి) సభ్యత్వం ఉంటేనే నువ్వు యాదవ్, లేకుంటే యాదవ్ కాదని వ్యాఖ్యానించడం కులాన్ని కించపరిచే విధంగా ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలతో మానసిక ఆవేదనకు గురైన సభ్యులు, గొర్రెల పెంపకదారుల సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్‌కు విషయం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, తోటి కులస్తుడై ఉండి కులాన్ని కించపరిచడం సరికాదని, తెలంగాణలో వేలాది మంది యాదవులు సభ్యత్వం లేకుండానే ఉన్నారని, వారిని యాదవులుగా పరిగణించకపోవడం తప్పు అని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామాభివృద్ధి కోసం భూమి విరాళం



**హుస్నాబాద్,ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ దాసరి రవీందర్ గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని మూడు గంటల భూమిని గ్రామపంచాయతీకి విరాళంగా అందజేశారు.నూతన సర్పంచ్ మాచ మల్ల శ్రీకాంత్ గెలిస్తే రెండు గంటల భూమి ఇస్తానని హామీ ఇచ్చిన రవీందర్, గ్రామ అవసరాలను పరిశీలించిన అధికారులు రెండు గంటలు సరిపోవని సూచించడంతో అదనంగా ఒక గంట భూమి జోడించి మొత్తం మూడు గంటలు విరాళంగా ఇచ్చారు. మాటను చేతలతో నిలబెట్టుకున్న ఆయన చర్య గ్రామంలో చర్చనీయాంశమైంది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాచ మల్ల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కౌడగాని వీరేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి, కౌడగాని హరీష్, కె. సారయ్య, వి. సారయ్యతో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి వ్యక్తిగత త్యాగాలే బలం అని, రవీందర్ చేసిన ఈ విరాళం భవిష్యత్ తరాలకు ఆదర్శమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## బధిర విద్యార్థులకు అంతర్జాతీయ పోటీలకు శిక్షణ

**-- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.గత నెల 29 నుండి ఈనెల 1 వరకు ముంబైలో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ది సైలెంట్ ఒలంపియాడ్--2026 అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ విద్యార్థులు పాల్గొని ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్గా నిలిచారు. 28 మంది విద్యార్థులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. కలెక్టరేట్‌లో విద్యార్థులను అభినందించిన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు మరింత శిక్షణ ఇవ్వాలని, జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి. కమల ఉదయ కుమారి, ఉపాధ్యాయులు జే. తులసీరామ్, కె. శ్రీనివాస్, ఎన్. సుజాత, బి. అఖిల్, ఎం. రాజశేఖర్ పాల్గొన్నారు.

## చండీశ్వర్ యూత్ సభ్యులకు జెర్సీలు స్పాన్సర్ చేసిన రావుల మహేష్



**మంచాల ఫిబ్రవరి 03 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** ఆరుట్ల గ్రామంలోని చండీశ్వర్ యూత్ సభ్యులు 110 మందికి జెర్సీలను స్పాన్సర్ చేసేటందుకు ముందుకొచ్చిన రావుల మహేష్ కు చండీశ్వర్ యూత్ సభ్యులు అభినందించి సత్కరించినట్లు యూత్ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## ఓదెల మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయ రమణారావు



**ఎలిగేడు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలంగాణ రాష్ట్రంలోని శైవక్షేత్రాలలో ఒకటైన ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధికి పక్కా ప్రణాళికతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మల్లికార్జున్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 12నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, 13న స్వామి వారి కళ్యాణం, 15న మహాశివరాత్రికఉత్సవాల పోస్టర్ మంగళవారం ఎలిగేడు మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు తన నివాసంలో ఓదెల దేవస్థానం కమీటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ చీకట్ల మొండయ్య,,ఈవో సదయ్య, డైరెక్టర్లు జంగం కొమురయ్య, కోదాటి మనోహర్రావు, ఈలుక రవీందర్, కట్కూరి సమ్మిరెడ్డి, కొండ శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాప్, తీర్థాల రాజారాం, ఈరవేన రవికుమార్, ఉప్పుల శ్రావణ్కుమార్, గంట రమేశ్, సామల యమున, ప్రధాన అర్చకులు ఎక్అఫీషియో మెంబర్ ధూపం వీరభద్రయ్య, అర్చకులు అభిషేక్, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, భక్తబృందం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

**-- సిడిపిఓ కవిత**



**ఎలిగేడు, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారానే పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సిడిపిఓ కవిత తెలిపారు.మంగళవారం నర్సాపూర్ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకుని, ఆరోగ్య లక్ష్య కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాలింతలకు ఒక నెల పాటు ఇంటికి భోజనం అందించేందుకు తీర్మానం చేశారు.కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ వెంకటేష్ గౌడ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఫిజియోథెరపీ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి

**-- ఎంఈవో నరేంద్రచారి**

**ఎలిగేడు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

దివ్యాంగ పిల్లలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో నరేంద్రచారి సూచించారు.మంగళవారం ధూళికట్ట ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో క్యాంపును ప్రారంభించారు. ప్రతి మంగళవారం వైద్యుడు అజయ్ అందుబాటులో ఉంటారని, దివ్యాంగ పిల్లలను కేంద్రంలో చేర్పించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు.తరువాత పాఠశాలలో దివ్యాంగుల టాయిలెట్లు, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో విలీన విద్యాభోధకులు సంతోష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




ధూళికట్టలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహణ

## సీఐ, ఎస్సైలను సన్మానించిన గిరిజన సంఘం

**వెల్దండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వెల్దండ మండల గిరిజన సంఘం నూతన అధ్యక్షుడు రాత్లావత్ అజిత్ నాయక్, మంగళవారం మండల కేంద్రంలో సీఐ రఘువీరారెడ్డి, ఎస్సై కురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉబ్బలగట్టు తండా సర్పంచ్ కేశ్య నాయక్, తారాసింగ్ నాయక్, లాలు నాయక్, నారాయణ నాయక్, రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# 5సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన నా నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోలేనిది





**నల్లగొండ ప్రజలతో నాది విడదీయని ఆత్మీయ బంధం**

**నల్లగొండ, ఫిబ్రవరి 3 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల తరుపున రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో అడుగడుగునా మంత్రికి నల్లగొండ పట్టణ ప్రజలు నీరాజనం పలికారు. మంచి చెడులో అండగా నిలిచే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటామని ప్రతినబూనారు. మంత్రి ప్రచారంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. మొదట చర్లపల్లి(15)వ డివిజన్ అభ్యర్థి పెరిక నాగరాజు,మర్రిగూడ 14 డివిజన్ అభ్యర్థి బొజ్జ శంకరయ్యకు మద్దతుగా చర్లపల్లి బొడ్రాయి చౌరస్తా వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం 12వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి మామిడి కార్తీక్,27 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సట్టు నాగమణి శంకర్, 28వ డివిజన్ అభ్యర్థి గుండబోయిన పుష్పలత వెంకన్న, 29వ డివిజన్ అభ్యర్థి గులాబ్ మహమ్మద్ షఫిక్, 26వ డివిజన్ అభ్యర్థి అసిమా సుల్తాన్( బషీర్ ),30 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మారగోని నవీన్ గౌడ్ తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ గా మార్చితే జరిగే లబ్ధి,కార్పొరేటర్లు,కొత్త మేయర్ వస్తే జరిగే అభివృద్ధి,సంక్షేమం పై ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగ ప్రసంగం చేశారు "5 సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన నా నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోలేనిదనీ,నల్లగొండ ప్రజలతో నాది విడదీయని ఆత్మీయబంధమన్నారు. నల్లగొండ నే నా ఇల్లు...నల్లగొండ నే నా ప్రాణం...నల్లగొండ నే నా కుటుంబం..నల్లగొండ నే నా జీవితమని,పేదప్రజల మధ్యలో ఉండడం నాకిష్టం" అని మంత్రి పేర్కొన్నారు పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా తట్టుకోననీ,ప్రతి విద్యార్థిలో తన కొడుకును చూసుకుంటా..వారు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు ఐతే సంతోషిస్తానని చెప్పారు. అందుకే ప్రతీక్ పేరు మీద ప్రభుత్వ స్కూళ్లు,కాలేజీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించానని,పట్టణంలోని 18 ప్రభుత్వ స్కూల్స్ ను నాణ్యమైన విద్యను అందించే మోడల్ స్కూల్స్ గా మారుస్తానని తెలిపారు..తన చివరి శ్వాస వరకు పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తానని,నల్లగొండను..హైదరాబాద్ లాంటి నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.. 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి క్లీన్ స్వీప్ చేస్తే..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఒప్పించి అధిక నిధులు తెస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరవేస్తానని,అభివృద్ధిలో నల్లగొండను నెంబర్ వన్ గా నిలుపుతానని అన్నారు..సన్న బియ్యంతో పేదవాడి ఆకలితీర్చడమే నిజమైన ఇందిరమ్మ రాజ్యంమని,10ఏళ్లు అధికారంలో ఉన్న వాళ్ళు కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు..డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట కాలయాపన చేశారనీ,ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో ఒక్కో ఇంటికి 5లక్షల ఆర్థిక సాయం చేస్తూ..పేదవాడి సొంతింటి కల నిజం చేస్తున్నామని తెలిపారు.. ఓటు కోసం ప్రతి పక్షాలు చెప్పే మాయమాటలు నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు..వారికి ఓటు వేస్తే వృధానే అవుతుందని,నా దగ్గరికి మీ సమస్యలు తీసుకువచ్చే కాంగ్రెస్ కార్పొరేటర్లను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లల చదువుకు,వైద్యానికి,ఏ ఆపద వచ్చిన ఆర్థిక సాయం చేయమని నా దృష్టికి తెచ్చే చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపిస్తే..5 ఏళ్ల పాటు నల్లగొండ పట్టణ అభివృద్ధి నేను చూసుకుంటానని మంత్రి భరోసానిచ్చారు.

తాను ఉండగా నల్లగొండలో శాంతి భద్రతలకు విఘాతం కలుగదనీ,అన్ని వర్గాల ప్రజలు తన వాళ్లే అని మంత్రి పునరుద్ఘాటించారు.. కులం,మతం బేదం లేకుండా అభివృద్దే లక్ష్యంగా సాగుదామని,అందుకు నల్లగొండ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హాఫీజ్ ఖాన్,నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,12వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా మామిడి కార్తీక్,27 డివిజన్ అభ్యర్థి సట్టు నాగమణి శంకర్,28వ డివిజన్ అభ్యర్థి గుండబోయిన పుష్పలత వెంకన్న,29వ డివిజన్ అభ్యర్థి గులాబ్ మహమ్మద్ షఫిక్,26వ డివిజన్ అభ్యర్థి అసిమా సుల్తాన్( బషీర్ ),30 వ డివిజన్ అభ్యర్థి మారగోని నవీన్ గౌడ్,పలువురు మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ఈ నెల 5న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ గ్రామంలో ఈనెల 5న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు హాజరుకానున్నారు.జిల్లా కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం తెలిపారు.ఈనెల 11న జరగనున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో గత రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమం, రానున్న మూడు సంవత్సరాల ప్రణాళికలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు.కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ మేయర్ స్థానం గెలవకుండా బిజెపి--బిఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. భూమాఫీయాకు పాల్పడిన వారు మళ్లీ బరిలోకి దిగుతున్నారని, ప్రజలు వారిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనుల్లో అవినీతి పై విచారణ జరిపించాలి

**- విద్యార్థి నాయకుడు సంతోష్**

**వెల్దండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రజావేదికలో బొల్లంపల్లి గ్రామ యువకులు ఎంపీడీవో సత్యపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు, సర్పంచ్ అభ్యర్థి సంతోష్ మాట్లాడుతూ, బొల్లంపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతి పై విచారణ జరిపించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2023--2025 మధ్య వచ్చిన నిధుల వినియోగంపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ, నిధుల వివరాలు అందజేస్తామని, అవినీతి నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# కాంగ్రెస్ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతుంది

**-ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**మానకొండూర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. వివిధ కుల సంఘాలతో సమావేశమై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమదృష్టితో చూసి వారి సంక్షేమం, అభివృద్ధికి



కృషి చేస్తోందని తెలిపారు. కుల సంఘ భవనాల కోసం స్థలాలు మంజూరు చేయడం, నిర్మాణాలకు నిధులు కేటాయించడం జరుగుతోందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్పొరేషన్ ఎన్నికల్లో మద్దతు తెలపాలని, 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవ రెడ్డి, జేవీ మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, ఎం. స్వాతి, శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, తొర్తి అరవింద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రయోగాలు ప్రజలకు వినియోగకరంగా మారాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు కేవలం సైన్స్ ఫెయిర్లలో ప్రదర్శనకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే వినియోగ వస్తువులుగా మారాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కుమార్వాడి)లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్లో ఆమె పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాలోని 17, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 8 పాఠశాలల విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, కోతుల



సమస్య పరిష్కారం వంటి వినూత్న ప్రాజెక్టులు విద్యార్థులు రూపొందించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలోని 35 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయని, విద్యార్థుల ప్రయోగాలను మరింత విస్తృతంగా ప్రదర్శించేందుకు కరీంనగర్‌లో జిల్లా సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, రోబోటిక్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శనలు అక్కడ ఏర్పాటు చేసి, విద్యార్థుల ఆవిష్కరణలు వినియోగ వస్తువులుగా మారి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధి గిరిజాశంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశా డేలో మాతృ-శిశు ఆరోగ్యంపై దృష్టి



**బయ్యారం, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "ఆశా డే" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సారంగం మాట్లాడుతూ, ఇన్స్టిట్యూషనల్ డెలివరీలను పెంపొందించడం, మాతృ మరణాలను తగ్గించడం ఈ నెల ముఖ్య లక్ష్యమని తెలిపారు. 12 వారాల లోపు గర్భిణీ స్త్రీల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. సిజేరియన్ ఆపరేషన్ల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ



సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సెంటర్ నుండి నెహ్రూ సెంటర్ మీదుగా ముత్యాలమ్మ గుడి వరకు పోలీసులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి మాట్లాడుతూ, సముచితమైన ఆహార నియమాలు పాటించడం, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. జంక్ ఫుడ్, శీతల పానీయాలు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే

**- శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్కే పట్టం కడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే చేపట్టిన పనులు చేయబోయే పనులను ప్రజలకు ఆయన వివరించారు. జూనియర్ కాలేజీ భూ సమస్యను పరిష్కరించి కాలేజీ నిర్మాణం చేస్తాం, 10 కోట్లతో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం, ఆమనగల్లు మున్సిపాలిటీలో 360 ఇందిరమ్మఇండ్లను మంజూరు చేసాం, మరిన్ని మంజూరు చేస్తాం, అలాగే రేషన్ కార్డులు 520 మంజూరు, మైనార్టీలకు కుట్టు మిషన్లు 250 పంపిణీ, మిగతా వారికి ఎలక్షన్ల తర్వాత పంపిణీ చేస్తాం, ఆమనగల్లు మున్సిపాలిటీ లో 32 కోట్లతో మంచినీటి వ్యవస్థ, ట్యాంకులు వాటర్ పైప్ లైన్ ఏర్పాటు, నూతన మున్సిపాలిటీ బిల్డింగ్ కు 2 కోట్ల మంజూరు, మున్సిపాలిటీలో హైమాస్ట్ లైట్లు,2 పార్కులు జీముల ఏర్పాటు చేశాం. షాద్నగర్ రోడ్డు నుండి మాడుగుల రోడ్డు వెడల్పు చేసి డివైడర్ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేశాం. బీసీ హాస్టల్ బిల్డింగ్ కు సి ఎస్ ఆర్ నిధులతో 4 కోట్లతో నిర్మాణం జరుపుతున్నాం అని కసిరెడ్డి నారాయణరెడ్డి గారు అన్నారు. అలాగే బిజెపి సీనియర్ నాయకులు చెరుకు యాదగిరిని పార్టీలోకి ఎమ్మెల్యే గారు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుర్రం కేశవులు, అవ్వారి శివలింగం, గాజుల శ్రీనివాసులు, శ్రీనివాస్ గౌడ్ ,బట్టు కిషన్ రెడ్డి, తెలుగు మల్ల జగన్, కుమార్ గౌడ్ మెకానిక్ బాబా, యాట నరసింహా, మానయ్య, కాల మల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి,ఎండి అబ్దుల్ రహీం ,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు




**గంగాధర, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్నేహిత ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఫోన్ వాడకూడదని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని, అందరూ స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, చదువులో మెరుగ్గా రాణించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైనప్పుడు 1098హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత--మల్లేశం, స్కూల్ హెడ్‌మాస్టర్ నాగేశ్వర్ రావు, మెడికల్ ఆఫీసర్ శ్వేత, పంచాయతీ సెక్రటరీ సాయి కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేణుక, పి.సి. కీర్తన, అంగన్వాడీ టీచర్లు కవిత, రమణ, ఎఎన్ఎం శ్రీలత, ఆశ శారదా, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో ఉపయోగకరంగా అభిప్రాయపడ్డారు.

## పోలీసుల చొరవతో బాధితురాలికి తిరిగి చేరిన ఆభరణాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అజాగ్రత్త వల్ల పోగొట్టుకున్న సొత్తును సీసీ కెమెరాల సాయంతో ట్రేస్ చేసి, నిజాయితీ గల ఆటో డ్రైవర్ ద్వారా బాధితురాలికి అందజేసి కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. రామడుగు మండలానికి చెందిన బొజ్జ లక్ష్మి (55) కరీంనగర్ బస్టాండ్ సమీపంలో తన పర్సును పోగొట్టుకున్నారు. వెంటనే పోలీసులను ఆశ్రయించగా, వారు సీసీ కెమెరాల ద్వారా పర్సును ఒక ఆటో డ్రైవర్ తీసుకున్నట్లు గుర్తించారు. విచారణలో అతను భగత్ నగర్‌కు చెందిన కోలపూరి జగన్ అని తేలింది. జగన్ తనకు పర్సు దొరికిన విషయాన్ని అంగీకరించి అందులో ఉన్న తులంన్నర బంగారు రింగు, మూడు బంగారు గుండ్లు, రూ. 750 నగదును భద్రంగా పోలీసులకు అప్పగించాడు. వన్ టౌన్ ఎస్సై రాజన్న ఆధ్వర్యంలో బస్టాండ్ అవుట్ పోస్ట్ వద్ద బాధితురాలికి సొత్తును తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై రాజన్న ఆటో డ్రైవర్ జగన్ నిజాయితీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంఘటనతో నిజాయితీ, వేగవంతమైన పోలీసు స్పందన, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో మునిపల్లి ఫణిత కాంగ్రెస్ పార్టీలో చేరిక

**కరీంనగర్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రముఖ సామాజిక కార్యకర్త, సమాజ సేవకురాలు మునిపల్లి ఫణిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల



రాజేందర్ రావు సమక్షంలో 9వ డివిజన్‌కు చెందిన ఫణిత పార్టీకి చేరారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ, పేదలకు సహాయం చేసే ఫణిత కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయమని, ఆమెకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఫణిత చేరికతో పార్టీ మరింత బలపడిందని అన్నారు. ఫణిత మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్థికాభివృద్ధి కల్పించేందుకు స్వశక్తి మహిళలకు ఆర్టీసీ అద్దె బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించి వారిని కోటీశ్వరులుగా మార్చుతోందని పేర్కొన్నారు. ఈ విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తన శక్తి యుక్తులు వినియోగిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల నర్మదా, నర్సన్న, పడిశెట్టి భూమయ్య, నాయకులు పన్యాల శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి 19వ వార్డులో బీఆర్ఎస్ ప్రచార హోరు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల ప్రచారం కల్వకుర్తి సుభాష్‌నగర్ 19వ వార్డులో ఉత్సాహంగా సాగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి శాహెద్ గడపగడపకు ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను కలుసుకున్నారు. గత ఐదు సంవత్సరాల్లో సుభాష్‌నగర్‌లో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుంటూ స్థానిక ఆడపడుచులు, యువకులు, పార్టీ కార్యకర్తలు శాహెద్‌కు మద్దతు తెలిపారు. వార్డులో మహిళలు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు.

## కేంద్ర బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

-- ఆంజనేయులు




**వెల్దండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ చట్టం, ఉపాధి హామీ పథకంపై తీసుకుంటున్న నిర్ణయాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు పిలుపునిచ్చారు. వెల్దండ పిహెచ్సీ వద్ద ఆశా వర్కర్లతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఆశా వర్కర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు కనీసం 26,000 వేతనం, 10,000 పెన్షన్, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, మెడికల్ సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు స్వప్న, జిల్లా కోశాధికారి యాదమ్మ, చంద్రకళ, జయమ్మ, మంగమ్మ, రాణి, సుజాత, బలమని తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా ఎంపికలు



**వెల్దండ, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు జరుగుతున్నాయి. మండలంలోని క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ ఫారంతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంఈఓ చంద్రుడు సూచించారు. ఈ ఎంపికల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

## దాసర్లపల్లి గ్రామ అభివృద్ధిలో ముందడుగు



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పునుంతల మండలంలోని దాసర్లపల్లి గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సర్పంచ్ బోదనపల్లి రమేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మహిళా సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం చేశారు. గ్రామంలోని మహిళా సంఘాల బలోపేతానికి శాశ్వత భవనం అవసరమని గుర్తించి, కొత్తగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం పక్కనే స్థలాన్ని కేటాయించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ పానగంటి శంకర్, గ్రామ కార్యదర్శి పవన్ కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు, బుక్ కీపర్, వార్డు సభ్యులు సంపూర్ణ, లక్ష్మీదేవి, ఉస్మాన్, సాయికిరణ్, అనూష, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల రెండో ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం సమక్షంలో సిబ్బందికి ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 49 పోలింగ్ కేంద్రాలు, కల్వకుర్తిలో 44, కొల్లాపూర్‌లో 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మొత్తం 131 పోలింగ్ కేంద్రాలకు గాను 159 మంది ప్రిసైడింగ్ అధికారులు, 159 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 474 మంది ఇతర పోలింగ్ అధికారులు కేటాయించారని తెలిపారు. ప్రతి కేంద్రానికి నలుగురు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పోలింగ్ రోజున ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదనంగా ప్రతి మున్సిపాలిటీలో ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా అలంకరించాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు డీఈవో రమేష్ కుమార్, సీతారాం నాయక్, సింహ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు బి-ఫారం అందజేత



**కల్వకుర్తి, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి--ఫారం అందజేశారు. కల్వకుర్తి, ఆమనగల్ మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్నికల ఇంచార్జ్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కలిసి బి--ఫారం అందజేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో 22 వార్డుల అభ్యర్థులకు, ఆమనగల్ మున్సిపాలిటీలో 15 వార్డుల అభ్యర్థులకు బి--ఫారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

-- ఆశా వర్కర్స్ యూనియన్



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ఉప్పునుంతల మండల పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ స్వప్నకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ, ఆశా వర్కర్లను స్వచ్ఛంద సేవకులుగా కాకుండా రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు కనీసం రూ.26,000 వేతనం, రూ.10,000 పెన్షన్ ఇవ్వాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, మెడికల్ సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పనిగంటలను ఎనిమిది గంటలకు పరిమితం చేసి, పనిభారాన్ని తగ్గించాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు కల్పించాలని, సీనియారిటీ ప్రాతిపదికన ఏఎన్ఎం పోస్టుల్లో పదోన్నతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు హేమలత, అనూష, రజిత, రేణమ్మ, గెలువమ్మతో పాటు ఆశా వర్కర్లు లక్ష్మి, పద్మమ్మ, వెంకటమ్మ, నర్మద, విజయ, సాలమ్మ, శైలజ, రాధా, చంద్రకళ, పార్వతమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## 11వ వార్డు అభ్యర్థి రాం పర్వతాలకు బి-ఫారం అందజేత



**కల్వకుర్తి, ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. కాంగ్రెస్ పార్టీ 11వ వార్డు విద్యానగర్ కౌన్సిలర్ అభ్యర్థి రాం పర్వతాలకు బి--ఫారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ బి--ఫారం అందజేయగా, కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి సభ్యుడు అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటిసి సభ్యుడు రామకృష్ణ, మాజీ వార్డు సభ్యుడు సామ బంగారయ్య, కాంగ్రెస్ నాయకులు వంశి ఆర్ట్ జంగయ్య, రావుల చెన్న కేశవులు, సామ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్.. భవిష్యత్తు యుద్ధాల గురించి సైనిక దళాల స్టడీ




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆపరేషన్ సింధూం యుద్ధ నీతిలో కొత్త పంథాకు తెరలేపింది. టెక్నాలజీ ఆధారంగా యుద్ధం ఎలా చేయాలన్న అనేక విషయాలను ఆ ఆపరేషన్‌లో తెలుసుకున్నారు. అయితే భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలకు చెందిన బలగాలు ఇప్పుడు తమ ఆధునిక నైపుణ్యాన్ని పెంచుకునే పనిలో పడ్డాయి. దీనిలో భాగంగానే ఢిల్లీలోని మానెక్‌షా కేంద్రంలో యుద్ధ కోర్సును ప్రారంభించాయి. యుద్ధ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, దానికి అనుగుణంగా ఎలా పటిష్టంగా తయారు కావాలన్న లక్ష్యంతో త్రివిధ దళాలు శిక్షణ మొదలుపెట్టాయి. సుమారు మూడు వారాల పాటు ఆ శిక్షణా కోర్సు జరగనున్నది. యుద్ధాల్లో టెక్నాలజీ ప్రభావం, మూడు దళాల మధ్య సమన్వయం ఎలా కుదుర్చుకోవాలి, స్వదేశీ ఆయుధాల ఉత్పత్తి లాంటి అంశాలపై ఈ స్టడీ జరగనున్నది. రక్షణ పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్‌తో పాటు త్రివిధ దళాలకు చెందిన వ్యక్తులు ఈ కోర్సులో పాలుపంచుకుంటున్నారు. త్రివిధ దళాల్లోని మేజర్ ర్యాంకు నుంచి మేజర్ జనరల్స్, జూనియర్ ఆఫీసర్లు తమ టెక్నాలజీ నైపుణ్యాన్ని షేర్ చేసుకోనున్నారు. ఆపరేషనల్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు వ్యూహాత్మక పరిజ్ఞానాన్ని సీనియర్ ఆఫీసర్లు పంచుకోనున్నారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో జరిగే డొమెయిన్ స్పెసిఫిక్ వార్‌ఫేర్ గురించి కోర్సులో నేర్చుకోనున్నారు. వార్‌ఫేర్ కోర్సును నిర్వహించడం ఇది మూడోసారి. అయితే ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇలాంటి శిక్షణా తరగతుల్ని నిర్వహించడం మొదటి సారి అవుతుంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎక్కువ సంఖ్యలో కొత్త టెక్నాలజీకి చెందిన డ్రోన్లను వినియోగించారు. ఇలాంటి వాటి గురించి తాజా కోర్సులో స్టడీ చేయనున్నారు. ఆధునిక యుద్ధ పరిజ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు ఈసారి బడ్జెట్‌లో రక్షణ రంగానికి అధిక నిధులు కేటాయించిన విషయం తెలిసిందే.



# పిఆర్‌పై పెద్దగా ఆధారపడను:

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.

# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

## రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు




బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృధ్వి రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు– ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్ట్రిబ్యూషన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.

# ఆ డైరెక్టర్ నైట్ డ్రెస్ వేసుకోమన్నాడు..

రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూకు హాజరైన హీరోయిన్ ఐశ్వర్య.. తన లైఫ్‌లో జరిగిన ఓ చేదు సంఘటనను షేర్ చేసుకున్నారు. .తన కెరీర్ స్టార్టింగ్ లో తాను ఒక సినిమా ఆడిషన్స్ కి వెళ్లానని చెప్పిన ఆమె.. అక్కడ ఆ డైరెక్టర్ తనను నైట్ డ్రెస్సులో కనిపించు అన్నాడంటూ ఐశ్వర్య చెప్పుకొచ్చారు. ఎందుకంటే, అతను తన బాడీ చుడాలని అన్నాడని.. ఆ సమయంలో తనకు చాలా కోపం వచ్చినట్టు చెప్పుకొచ్చారు. అంతేకాదు ఇలా అతను ఎంతమందిని అడిగి ఉంటాడోనని తరువాత అనుకున్నానని.. చాలా బాధేసిందంటూ ఎమోషనల్ అయ్యాడు. అయితే, తనను అలా అడిగిన దర్శకుడు ఎవరు అనేది మాత్రం రివీల్ చేయలేదు ఈ బ్యూటీ. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ పాలిటిక్స్‌లోకి రానని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశమే లేదన్నారు. తాజాగా తండ్రి నిర్ణయంపై ఆయన కుమార్తె సౌందర్య రజినీకాంత్ స్పందించారు. విత్ లవ్ మూవీ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. తన తండ్రి నిర్ణయం పట్ల తమకెలాంటి బాధ లేదన్నారు. ఆయనకు ఏది నచ్చితే కుటుంబమంతా మద్దతుగా ఉంటుందని తెలిపారు.



# ధురంధర్ 2' ఎఫెక్ట్..

## వాయిదా దిశగా అడివి శేష్ 'డెకాయిట్'?




టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ'. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రం తాజాగా వాయిదా పడనుందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే అదే సమయంలో బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'తో పాటు కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీ నెలకొంది. ఈ భారీ చిత్రాల మధ్య థియేటర్ల లభ్యత, కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో 'డెకాయిట్' చిత్రాన్ని ఏప్రిల్ 10, 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ బాక్సాఫీస్ క్లాష్ గురించి అడివి శేష్ స్పందిస్తూ తమ సినిమా పెద్ద చేపల మధ్య ఒక 'గోల్డ్ ఫిష్' లాంటిదని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సోలో రిలీజ్ కోసం వెతకడమే శ్రేయస్కరమని టీమ్ భావిస్తోంది. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీపై అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.